# దున్నపోతు ఈనింది..

-కొలనుపాక మురళీధరరావు

రామయ్య, మల్లయ్య, వెంకటేశ్ కొందరు వడివడిగ పోతున్న ట్రాక్టర్ ట్రేయిలర్ పట్టుకొని లోపలికి ఎగిరి కూర్చుండ్రు. డ్రైవర్ మస్తాన్ ఇదేమి పట్టనట్టు బండి పోనీస్తుండు. రాయన్న బండి ఓనరు అసలే కోపిష్టోడు, దానికి దీనికి గులుగుతడు. పొలంలో ఎదురు చూస్తున్న రాయన్న "ఏంద్రా ఇయాల ఇంతసేపైంది. నడినెత్తి మీదికి పొద్దువచ్చేవరకు పన్లోకి రారా".. గయ్యిమన్నాడు. మస్తాన్ దూరం నుండే చూస్తూ.. "కూలోళ్ళను జమ చేసుకునే సరికి ఈయేళ్ళైంది. నేనేమన్నా మేస్త్రీనా? గుత్తె దారుణ్ణా? కూలోళ్లను జమచేసుకొని తీసుకరావడాన్కి, బీడిముట్టిస్తూ తాపీగ అన్నాడు. సరే సరే నీతో మాట్లా డమే దిమాఖ్ ఖరాబ్.

రామయ్య, మల్లయ్య ట్రాక్టరు కిందికి దిగి గడ్డి మోపులు కట్టి ట్రాక్టరు మీద ఉన్న వెంకటేశ్, ఇంకా ఆడ కూలోళ్ళకు అందిస్తుంటే వాళ్ళు కాళ్ళతో తొక్కుతూ అణగపెట్టి లోడ్ చేస్తున్రు.

ఇంతలో ఆడ ఉన్న ఎడ్లు పోట్లాడుకుంటూ ఒక ఎద్దు మల్లయను పొడ్చిపోయింది. 'వాయ్యో ఓనాయినో చూస్తిరో...' అంటూ కడుపు పట్టుకుంటూ కూలబడి పోయిండు. కూలోళ్ళు గబగబా దిగి మల్లయ్యను పట్టు కున్రూ. 'రాయన్నా.. మావోడు చస్తుండు, చూస్తున్నవే మయ్య దవాఖానుకు పంపించు' తొందరపెట్టి గడబిడ చేస్తున్న కూలోళ్ళను చూస్తూ 'ఆ మాత్రము చూచుకోవద్దా, నా తప్పేం వుంది. ఎద్దు పొడుస్తే నేనేం చేయను' బిం కంగా అన్నాడు. 'సరే అయితే పోలీసు స్టేషన్‌కు పోదాం పదండ్రా. ఆడ తేల్చుకుందాం..' అప్పుడే వస్తున్న యువకూలి శీను అన్నాడు.

"కేసులు వద్దు, గీసులు వద్దు, నేనే దవాఖానాకు తీసుకెళ్ళి మందేయిస్తా.." అంటూ ఓ మెట్టు దిగాడు రామన్న. సరే పానం పోయేట్టుంది. ముందుగాల దవా ఖానకు తీసుకెళదాం. సర్కారు దవాఖానకైతే పోలీసు కేసవుద్ది. నాకు తెల్సిన డాక్టరు శ్రీకాంత్ దవాఖానకు తీసుకవెడదాం అంటూ ఆటో తీసుకొచ్చి రామయ్యను శ్రీకాంత్ దవాఖానకు తీసుకపోయిండ్రు. రాయన్న ఏం మాట్లాడిండో ఏమో ఎద్దుపొడిస్తె చచ్చిపోయిండు అని కాగితం రాసి చేతుల్లో పెట్టాడు. "ఓ నాయనో, ఓ దేవుడో చెట్టంతా కొడుకు పోయిండు.." అంటూ అక్కడే రాగాలు పెట్టిండ్రు మల్లయ్య తల్లిదండ్రులు నెత్తి నోరు బాదుకుంటు. ఆ గడబిడలో, రాయన్న "మీకు నేను డబ్బులు ఇస్తా ఈడే ఉండి ఏం లాభం, శవం ఖర్చు లిస్తా, మంచి వకీలును మాట్లాడి కంపెనీ వాళ్ళకాడి నుండి నష్ట పరిహారం ఇప్పిస్తానంటు" వాళ్ళను సర్దిజెప్పే సరికి తల ప్రాణం తోకకు వచ్చింది.

వకీలు సలహాతో 'నా కొడుకును ఎద్దు పొడిస్తే చచ్చిపోయిండు 20 ఏండ్ల పిల్లగాడు నెల సంపాదన పోయింది, చెట్టంత కొడుకు పోయిండు. ఇంక నాకు దిక్కెవరు' అంటూ, రాయన్న దగ్గర పనిచేస్తుండు కాబట్టి రాయన్న ఐదు లక్షల డబ్బులు ఇవ్వాలని లేబరు కోర్టులో దరఖాస్తు ఏయమన్నారు. మరి రాయన్న తక్కువ తిన్నాడా. మల్లయ్య నా దగ్గర పనిచేస్తుండగ ఎద్దు పొడిచిన మాట నిజమే, చచ్చింది నిజమే. అతనికి నెలకు మూడు వేలు జీతం యిస్తున్నాం నిజమే అంటూ జీతం కాగితం ఇస్తూ ఇన్సురెన్సు కంపెనీకి నేనే డబ్బు కట్టినాను. కాబట్టి ఇన్సురెన్సు వారే మల్లయ్యకు నష్టపరి హారం చెల్లించాలని తన జవాబు యిచ్చుకుండు. "ఇదేందయ్యో మాకు డబ్బులిప్పిస్తానని కోర్టుల చుట్టు తిప్పుతున్నావు. రెండేండ్లాయే పిల్లగాడు బాయే, మేమెమో పెద్దమనుషలైతిమి' రాయన్న మీద ఒత్తిడి తెచ్చిండ్రు.

లేబరు ఆఫీసరు లేడు తబాదుల అయింది, అంటూ ఆర్నేలు తిప్పుకున్నాడు. ఇంగలాభం లేదని సర్‌పంచ్‌ను ఇంకా కొంతమంది పెద్దమనుషలను తీసుకొని వకీలుసాబు ఇంటికి పోయిన్రు. నమస్తే వకీలు సాబు. మా కేసు ఏంచేసిన్రు, మల్లయ్య తండ్రి భూమయ్య.

లేబర్ కమీషనర్ లేరయ్యా తబాదుల అయింది. రెండు నెలల్లో కొత్తాయన వస్తడంట అందాక ఓపిక పట్టండి, ఇన్నాళ్ళు ఆగిండ్రు కదా.

ఆ రాయన్న మాటలనమ్మి మిమ్ములను పెట్టుకున్నం దుకు బాగానే ఉంది కథ. ఇంకా మావల్లకాదు సార్, మీకు చేతకాదని చెబితే మేం పెద్దవకీలును పెట్టు కుంటాం, మా ఎమ్మెల్లే మాట్లాడుతానంటుండి. మా లేబరోళ్ళు ఇంకా ఎన్నాళ్ళు, నీ ఎనుక ఏసినోళ్ళకు డబ్బు వచ్చినది అంటున్నారు.

అప్పుడు లేబర్ ఆఫీసర్ ఉండే, మరిప్పుడు ఆయన

లేంది నేనేం చేయను. ఈ తడవ తప్పని సరిగ్గా రెండు నెలల్లో మీకు డబ్బులిప్పిస్తా సరేనా అని వాళ్ళకు సర్దిచెప్పి పంపించాడు ఆ వకీలు సాబు. వాండ్లు అటు పోయిండ్రో లేదో రాయన్న వచ్చిండు. ఏం వకీలు సాబు నా మీద కేసు రాకుండా చూసుకో. డబ్బులు ఇన్సురెన్సు కంపెనీ వాళ్ళు ఇచ్చేటట్టు చూడు, నీవేం చేస్తావో చేయి. నీ పర్సంటేజు నీవు తీసుకో. ఇప్పటికే నాకు పదివేలు ఖర్చు అయి డాక్టరు చుట్టు తిరిగి వాళ్ళకు శవం ఖర్చులని, చావు భోజనం ఖర్చని నన్ను చంపుకు తింటున్రు. నేను కోర్టుకు రాకుండా చూసుకో వకీలు సాబు. నాకేమో ఎలక్షన్లు వస్తున్నాయి. మా పార్టీవాళ్ళు పిలుస్తున్నారు. నీ సంగతి చెప్పిన. నీకు పార్టీ కేసులిప్పిస్తామన్నారు. అందుకే ఈ కేసు బాగా చేసేయ్, నా తరఫున బొచ్చెడు కేసులు, మర్డరు కేసులు కూడా చేస్తావా.

ఏం ఎవరినైనా మర్డరు చేయించావా?

లేదు కాని ఊళ్ళో ఏడ ఏమైనా జరిగితే నీకాడికి తీసుకవస్తా మరి నన్ను కనిపెడతావు కదా.

ఏం పనిమీద ఉన్నావ సారూ.

హైద్రాబాద్ పోవలె ఇన్సూరెన్సూతో మాట్లాడి వస్తా, రేపు నీవు కూడా వస్తె కేసు నీ మీద రాకుండా చేస్తా. నీ కారులోనే పోయి మళ్ళా మధ్యాహ్నం సెక్రటేరియట్‌కు కూడా పోదాం సరేనా. ఇంగ నాకు పని ఉందంటు లోపలికి పోయిండు వకీలు సాబు.

ఏం వకీలు సాబో, ఏం కేసులో అనవసరంగా నే ఇరుక్కున్నా. ఇంకా నయం పోలీసు కేసు కాలేదు. పోలీసోళ్ళ కంట పడితే చేయి బాగా తడిసేది. గొణుక్కుంటూ పోయిండు రాయన్న.

రెన్నెల్ల తర్వాత వకీలుసాబు కారటేసి లేబరు కోర్టులో కేసునడస్తది. ఇద్దరు కాగితాలు తీసుకొని రండని రాస్తె పోయిండ్రు.

గుంపుతో నిండి ఉంది కచ్చేరి. ఇంకా కమీషనరు సాబు రాలేదు. వస్తడు కూకొండన్నారు చప్రాసి. ఎండలు మండిపోతున్నాయి. పొద్దున ఇంత తిని వచ్చినం. ఇంకా పిలువడం లేదని ఆడకూకున్నా రంటున్నారు. ఇంతలో కమీషనరు వచ్చిండని హడావిడి పడ్డారు. వకీలు సాబును పిలిపించండి, టైపుచేసిన కాగితాల మీద వేలి ముద్రలు తీసుకొని పొమ్మన్నాడు. ఏందయ్యా వకీలు సాబు మాకు పైసలు ఇప్పిస్తాడా. చెట్టంత కొడుకుపోయి దుఃఖంలో వున్నాము. నేనేదో ఐదు లచ్చలిప్పిస్తనంటే ఇక పోయినోడు పోయె తిరగొస్తాడా, వాడి పేరు చెబుకొని ఆ పైసలిప్పిస్తే మా బతుకు మేం బదుకుతాం అన్నాడు భూమయ్య. మళ్ళా నెలకు రాండ్రి అన్నాడు వకీలు సాబు అప్పుడన్నా పైకము చేతిలో బడ్డదా అడుగుదామనుకుంటె మోటారు సైకిలెక్కి పోయిండు వకీలు సాబు నెల రోజుల తరువాత చూద్దాం అనుకుంటు. వాళ్ళు బస్టాండుకు దారి తీసిన్రూ.

ఒక నెల అయిపోయింది. మళ్ళా లేబరు ఆఫీసు కొస్తె కమీషనర్ సాబు సెలవు మీదున్నాడు. వారం పది రోజులు పడ్తుంది, అన్నాడు అక్కడున్న చప్రాసీ.

ఆర్డరు కాగితాలొచ్చినవంట, రెండున్నర లచ్చలు వచ్చినాయని సర్పంచ్ చెప్పితే వకీలు సాబు ఇంటికి పోయి, వకీలు సాబు మాకేసేమైందని తెలివిగా అడిగిండ్రు. ముందే పైసల ముచ్చట తీయకుండా.

ఆర్డరు వచ్చిన మాట నిజమే కాని, ఇన్సూరెన్సు కంపెనోడు అప్పీలుకు పోయిండు.

అదేంది సార్ మాకర్తమయ్యేటట్టు చెపండ్రి.

మీరేమో ఎద్దు తగిలితే మీ పిల్లగాడు చనిపోయిండని కేసు పెట్టిండ్రు. సాక్ష్యంలో దున్నపోతు పొడిస్తే చచ్చిపోయిందని చెబితే, కమీషనర్ సాబ్ దున్నపోతు పొడిస్తే చనిపోయినాడు మల్లయ్య, నష్టపరిహారం రెండు లక్షలు మంజూరు అని ఆర్డరిస్తె, ఇన్సూరెన్సు ఓడు ఇంతకీ కేసు ఎద్దుకేసా, దున్నపోతుదా? దున్నపోతు ఈనై దూడను దొడ్లో కట్టేయమన్నట్టు ఈ కథ. కమీషనర్ రాసిన ఆర్డరు ఖానూన్ కిలాఫ్ అని ఇన్సూరెన్సు కంపెనోడు మురాఫా చేసిండట సర్పంచ్ చల్లగ చావు కబురు చెప్పిండు. మల్లయ్య తల్లి దండ్రులకు ఏం సమజ్ గాక నెత్తి గోక్కుంటు "ఇంతకీ మే ఏం చేయాలి సాబ్" అడిగారు.

మురాఫా అంటె అప్పీలు ఆర్డరు వచ్చినాక రాండ్రి. "ఎన్ని రోజులు పడ్తది?" అడిగిండ్రు.

నాకేం తెల్సు, ఎన్ని రోజులు పడ్తదో, సంవత్సరములు పడ్తవో, అంటు విసుక్కుంటూ వకీలు సాబ్ దోస్త్‌తో బయటికి పోతుంటే.

ఈ వకీళ్ళు తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేస్తారు. మీ డబ్బులు తొందరగాన ఇప్పిస్తా భరోసా యిచ్చాడు సర్పంచ్ తన తప్పేంలేదనట్లు.

చెట్టంత కొడుకు పోయే, చేతికి పైసలు రాకపోయే, ఏంచేతురో దేముడో అనుకుంటు దిగులుతో ఇంటి దారి బట్టిండ్రు. ■